క్లుప్తంగా

26 నుంచి మహాకుంభాభిషేక మహోత్సవాలు



విజయవాడ కల్చరల్: పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో కొలువైవున్న పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో అష్టబంధన, మహాకుంభాభిషేక మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలితారమాదేవి తెలిపారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈనెల 26 నుంచి 31వ తేదీ వరకు మహోత్సవాలు జరుగుతాయన్నారు. 26న ఉదయం ఆచార్యవరణము, వాస్తుశాంతి, అంకురార్పణ, 27న ఉదయం అగ్నిమథనము, అగ్ని ప్రతిష్ఠ, 28 నవగ్రహారాధన, కుంభారాధనలు, 29న సర్వశాంతిహోమం, 30న విశేష శాంతిహోమం, 31న మహాకుంభాభిషేక కార్యక్రమాలను నిర్వహిస్తునట్లు తెలిపారు.నీ సందర్భంగా బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో సంబంధిత ఉద్యోగులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వ్యవసాయ, సహకార శాఖ అధికారులు సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని ఫ్యాకల్టీ మల్లిఖార్జునప్రసాద్ అన్నారు. బుధవారం కేడీసీసీబీ రీజినల్ కార్యాలయంలో సహకార చట్టంపై జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సహకార శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకు, సరైన సమాచారం త్వరితగతిన అందించేందుకు ఈ చట్టం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి డాక్టర్ శ్రీనివాసరెడ్డి, జిల్లా సహకార ఆడిట్ అధికారి అజిత కుమారి, విభాగ సహకార అధికారి కిరణ్ కుమార్, సహకార శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



పాయకాపురం(విజయవాడరూరల్): పాత పా డు గ్రామంలో కాలకృత్యాలకెళ్లి కాలు జారి పోలవరం కాల్వలో కొట్టుకుపోయిన పత్తివాడ మధుసూదన్ (26) మృతదేహాన్ని ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది ఈలప్రోలు గ్రామం బుడమేరు కాల్వలో కనుగొన్నారు. ప్రకాష్‌నగర్‌కు చెందిన మధుసూదన్ ఈ నెల 20వ తేదీన తన స్నేహితుడితో కలిసి పాతపాడు గ్రామం వెళ్లాడు. కాలకృత్యాలకు వెళ్లిన మధుసూదన్ కాలుజారి పోలవరం కాల్వలో పడిపోయి గల్లంతయ్యాడు. నున్న సీఐ పి.కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. ఈలప్రోలు గ్రామం బుడమేరు కాల్వలో మధుసూదన్ మృతదేహాన్ని ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది కనుగొన్నారని నున్న పోలీసులు తెలిపారు.

వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర జీవనం సాగించాలని కళాశాల ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన ప్యూర్ విజన్ హాస్పటల్ సౌజన్యంతో ఉచిత కంటి, దంత వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ కళాశాల అధ్యాపకులు, విద్యార్థుల కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. అనంతరం ప్రముఖ కంటి, దంత వైద్యులు ఉచితంగా బీపీ, షుగర్, కొలెస్ట్రాల్, కంటి, దంత వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే!

- వర్షానికి బురద కయ్యలుగా మారుతున్న రోడ్లు
- రోడ్ల నిర్మాణంపై శ్రద్ధ చూపని పాలకులు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు

పాయకాపురం(విజయవాడరూరల్): నగర శివారు ప్రాంతలైన కండ్రిక, జర్నలిస్టు కాలనీ, ప్రజాశక్తి నగర్‌లోని అంతర్గత రోడ్లు చినుకు పడితే నడిచేందుకు వీల్లేక బురద కయ్యలుగా మారుతున్నాయి. గత ఏడాది ఆగష్టు నెల చివరిలో వచ్చిన వరదల్లో ముంపునకు గురైన ప్రాంతాల్లో కూటమి ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్ట లేదని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. ముంపు నివారణ చర్యలను ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదంటున్నారు.

బురద రోడ్లపై అవస్థలు..

రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పల్లంగా ఉన్న రోడ్లు అధ్వానంగా మారాయి. బురద రోడ్లపై ప్రజలు నడవటానికి నానా అవస్థలు పడుతున్నారు. అయినా తప్పని సరిపరిస్థితుల్లో రాకపోకలు సాగిస్తున్నా అధికార పార్టీ నాయకులు అటు వైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదంటున్నారు. కండ్రిక- రాజీవ్‌నగర్ మెయిన్ రోడ్డుకు ఉత్తరంగా ఖాళీ స్థలాలు ఉండటంతో ఎప్పుడు వర్షాలు కురిసినా వర్షం నీరు ఆ ఖాళీ స్థలాల్లో రోజుల తరబడి నిలబడుతున్నాయి. ఖాళీ స్థలాల యజమానులకు వీఎంసీ నోటీసులు జారీ చేసి మెరకచేసేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు పలు దఫాలు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదు.



కండ్రికలో బురదమయంగా ఉన్న రోడ్డు

ఇలా చేస్తే మేలు..

వర్షం నీరు నిల్వ ఉండటం వల్ల వ్యర్థాలతో కలిసి దుర్వాసన వస్తోందని అంటున్నారు. దోమలు అధికంగా ఉండి జ్వరాలకు కారణమవుతున్నాయని స్థానికులు తెలుపుతున్నారు. అంతర్గత రోడ్లు, డ్రెయిన్లు నిర్మించి వర్షం నీరు అవుట్‌పాల్ డ్రెయిన్‌లో కలిసే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



జర్నలిస్టు కాలనీలో రోడ్డు దుస్థితి



ఇళ్ల మధ్య నిలిచిన వర్షం నీరు

రోడ్లు నిర్మించాలి



మా ప్రాంతంలో అంతర్గత రోడ్లు దారుణంగా ఉన్నాయి. వర్షం కురిస్తే బురదలోనే నడవాల్సి వస్తోంది. స్కూల్స్‌కు వెళ్లే పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు బురదలో నడిచి వెళ్లాలంటే నానా అవస్థలు పడుతున్నారు. రోడ్లు వేసి కాలువలు తీయాలి.

– మరియమ్మ, కండ్రిక,

ఏడాదిగా ఎదురు చూస్తున్నాం



ఏడాది కాలంగా రోడ్లు నిర్మిస్తారని ఎదురు చూ స్తున్నాము. బుడమేరు వరదలు సంభవించిన సందర్భంలో రోడ్లు నిర్మిస్తామని చెప్పారు. ఇంత వరకు రోడ్లు నిర్మించలేదు. వర్షం కురిస్తే ఇబ్బందులు తప్పడం లేదు. మా సమస్యలు తీర్చాలి.

– జి.ముక్కంటి, కండ్రిక

రూ.50 లక్షలు మంజూరు

దెబ్బతిన్న అంతర్గత గ్రావెల్ రోడ్ల నిర్మాణానికి విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ 50 లక్షల రూపాయలను మంజూరు చేసింది. ఆ పనులు త్వరలో ప్రారంభిస్తాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– బి.మాధవ్, ఏఈ, వీఎంసీ, రాజీవ్‌నగర్, కండ్రిక

విపత్తులపై అప్రమత్తంగా ఉండాలి

వీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్

పటమట(విజయవాడతూర్పు): విపత్తులు సంభవించిన సమయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వీఎంసీ అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి. చంద్రశేఖర్ తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని నూతన భవనంలో ఉన్న సమావేశపు హాల్లో విపత్తుల నిర్వహణపై వీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్‌తో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విపత్తు ఎన్ని విధాలుగా రావచ్చు, రాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి, ఎదుర్కొన్న తర్వాత తీసుకునే చర్యలు వంటి అంశాలపై సిబ్బందికి సూచనలు చేశారు. ఇతర రాష్ట్రలు, దేశాల్లో విపత్తు నిర్వహణ ఎలా జరుగుతుంది, ఆ పద్ధతులు ఏ విధంగా మనకు అమలు చేయొచ్చు వంటి విషయాలపై చర్చించారు. విజయవాడ నగరపాలక సంస్థ గత ఏడాది తీవ్రమైన విపత్తును ఎదుర్కొందని, విపత్తు ఎప్పుడొస్తుంది ఎలాంటి పరిస్థితుల వల్ల వస్తుంది అన్న అంశాలు మనం చెప్పలేమని, కానీ విపత్తు ఎలా వచ్చినా వీఎంసీ పరిధిలో విపత్తు సమయంలో పునరావస కేంద్రాలు ఎక్కడున్నాయో, వాటి కోసం ఎవరిని సంప్రదించాలి వారికి సహాయానికి వచ్చే బృందాల నంబర్లు, అన్ని విషయాలు విపత్తు సంభవించే ప్రాంతాలకు తెలిపరిచినట్లు వెల్లడించారు. తద్వారా ప్రజలు ఎటువంటి పరిస్థితుల్లోనైనా సరే వారిని వారు కాపాడుకునే చర్యలు కచ్చితంగా తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమం లో విజయవాడ నగరపాలక సంస్థ చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, వీఎంసీ డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎ.ఉమామహేశ్వర రావు, రోడ్ ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌చార్జి ఆఫీసర్ ఆర్. ప్రవీణ్, అసిస్టెంట్ మేనేజర్ స్రవంతి, ఏపీసీపీడీసీఎల్ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎంవీవీ రామకృష్ణ, ప్రోగ్రాం ఆఫీసర్ ధనుంజయ్ రావు, వీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ డి. చంద్రశేఖర్, వీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్

25 నుంచి నూతన యాగశాలలో హోమాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): 25వ తేదీ శ్రావణ మాసం తొలి శుక్రవారం నుంచి అమ్మవారి సన్నిధిలో నూతనంగా నిర్మించిన యాగశాలలో హోమాలు నిర్వహించేందుకు వైదిక కమిటీ నిర్ణయించింది. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలోని రాధాకృష్ణ విగ్రహాలు వద్ద సుమారు రూ. 5 కోట్ల వ్యయంతో దాత సంగా నరసింహరావు నూతన యాగశాలను నిర్మించారు. శ్రావణ మాసం కల్లా నూతన యాగశాల అందుబాటులోకి తీసుకురావాలని ఈవో శీనానాయక్ ఇటీవల ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించడంతో యాగశాల పరిసరాల్లో మిగిలిన పనులను వేగంగా పూర్తి చేశారు. పనులు పూర్తి కావడంతో శుక్రవారం నుంచి యాగశాలలో చండీ హోమం, గణపతి హోమం, నవగ్రహ శాంతి హోమాలు నిర్వహించనున్నారు. అమావాస్య, పౌర్ణమి, ఇతర విశేషమైన రోజుల్లో హోమాలు జరిపించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారి సన్నిధికి చేరుకుంటారు. దీంతో భక్తుల ఇబ్బందులను పరిగణలోకి తీసుకున్న దేవస్థానం ఆలయ ప్రాంగణంలో నూతన యాగశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. నూతన యాగశాల నిర్మాణానికి దాత సంగా నరసింహరావు ముందకు రావడంతో పూర్తి వ్యయాన్ని ఆయనే భరించి పనులను జరిపించారు. ఎట్టకేలకు భక్తులకు నూతన యాగశాల అందుబాటులోకి రావడంతో ఇబ్బందులు తొలగిపోయాయి.



నూతన యాగశాల (ఫైల్)

మూడు షిఫ్ట్‌లలో విధులు నిర్వర్తించాలి

పటమట(విజయవాడతూర్పు):వర్షాకాలంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించటానికి వీఎంసీ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఎమినిటీ, శానిటరీ, ప్లానింగ్ సెక్రటరీలతో ఏర్పాటుచేసిన మాన్సూన్ రెస్పాన్స్ టీం మూడు షిఫ్ట్‌లలో పని చేయాలని కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ప్రకాశం బ్యారేజ్, రథం సెంటర్, బందర్ రోడ్, బెంజ్ సర్కిల్, బెంజ్ సర్కిల్ నుంచి రామవరప్పాడు నేషనల్ హైవే సర్వీస్ రోడ్ ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మాన్సూన్ రెస్పాన్స్ టీంకు కేటాయించిన పాయింట్లలో ఉదయం 6 గంటల నుంచి మూడు షిఫ్ట్‌లలో విధులు నిర్వహించాలని ఆదేశించారు. వర్షం వచ్చినా రాకపోయినా కచ్చితంగా మాన్సూన్ రెస్పాన్స్ టీం తమ తమ పాయింట్లలో ఉండాలని సూచించారు. వర్షం వచ్చిన వెంటనే పది నిమిషాల్లో రోడ్డుపైన నీటి నిల్వలు ఉండకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి టీం తమ వద్ద నీటి నిల్వలు తీసేందుకు అవసరమైన పరికరాలు ముందుగానే సమకూర్చుకోవాలని స్పష్టం చేశారు. ఈ టీంలను ఆయా విభాగాల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తుండాలని కోరారు. చీఫ్ ఇంజినీర్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్, చీఫ్ సిటీ ప్లానర్ ముగ్గురు సమన్వయంతో మాన్సూన్ రెస్పాన్స్ టీం సమర్థవంతంగా పనిచేయాలని తెలిపారు. చీఫ్ ఇంజినీర్ ఆర్. శ్రీనాథ్ రెడ్డి నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించాలని సూచించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కె. షమ్మీ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల్ కృష్ణ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.



వర్షం వల్ల దెబ్బతిన్న రోడ్లను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలి

విజయవాడ కల్చరల్: ప్రభుత్వం, కళ, సాంస్కృతిక సంస్థలు కళాకారుల సంక్షేమం కోసం కృషి చేయాలని ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి అన్నారు. ఆదిలీలా ఫౌండేషన్, పద్మశ్రీ ఘంటసాల చైతన్య వేదిక, తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో నవ్యాంధ్ర సాంస్కృతిక చైతన్య ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర మహాసభలు బుధవారం కొత్తా పూర్ణానందం కళావేదికమీద ముగిశాయి. కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ నవ్యాంధ్ర నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కే డేవిడ్‌రాజు, సింగంశెట్టి చంద్రశేఖర్, గోళ్ళ నారాయణరావు పాల్గొన్నారు. గాయనీ గాయకులు కే వెంకటేశ్వర రెడ్డి, టీఎస్‌రెడ్డి, కొండేటి దుర్గానాగమణి, వీ కామేశ్వరి, ప్రిన్స్‌లు చిత్రగీతాలను ఆలపించారు. చైతన్య వేదిక పోస్టర్‌ను అతిథులు ఆవిష్కరించారు.



మహాసభలో పాల్గొన్న గాయనీ గాయకులు, ప్రతినిధులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గాంధీనగర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ అన్నపూర్ణ ఫీడర్ పరిధిలోని విద్యుత్తు లైన్లు, మరమ్మతుల నిమిత్తం గురువారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ స్టేషన్ ఏరియా, ఏలూరు రోడ్డు, ప్రకాశం రోడ్డు, అలీబేగ్ వీధి, ఎన్టీఆర్ కాంప్లెక్స్, అట్లూ రత్తయ్య వీధి, డీటీ రావు వీధి, గోపాల్‌రెడ్డి రోడ్డు ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

నక్కల రోడ్డు ఫీడర్ పరిధిలో..

నక్కలరోడ్డు, గోపరాజు రామచంద్రరావువీధి, చిలుకు దుర్గయ్య వీధి, గోవిందరాజులు నాయుడు వీధి, నరసింహారావు నాయుడు వీధి, కాశీశ్వరావు రోడ్, వెంకటరత్నం వీధి, ఏలూరురోడ్డు షెూరీల దొడ్డి ఏరియా, సోనోవిజన్ (పాత విజయాటాకీస్)ఏరియా, విష్ణువర్ధనరావు వీధి, పీసపాటివారి, తాడేపల్లి వారి వీధి, కోకా చలపతిరావు వీధి, డోర్నకల్ రోడ్ ఎండోకేర్ హాస్పిటల్ ఏరియా లలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అమరావతిలో సినీనటుడు ‘కోట’ విగ్రహం ఏర్పాటు చేయాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సినీనటుడు, మాజీ ఎమ్మెల్యే కోట శ్రీనివాసరావు కాంస్య విగ్రహం రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయాలని ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య డిమాండ్ చేసింది. బుధవారం గాంధీనగర్‌లోని కొతావారి సత్రంలో ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (ఏపీబీఎస్ఎస్ఎస్) రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. తొలుత ఇటీవల మరణించిన కోట శ్రీనివాసరావుకు నివాళులర్పించారు. సమావేశంలో ఏపీబీఎస్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జ్వాలాపురం శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని అమరావతిలో సినీ దిగ్గజం కోట శ్రీనివాసరావు విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్థలం కేటాయిస్తే బ్రాహ్మణ సంఘాల తరపున కోట కాంస్య విగ్రహం అందజేస్తామన్నారు. ప్రతియేటా కోట శ్రీనివాసరావు పేరుమీద కళాకారులకు అవార్డులు ప్రకటిస్తామన్నారు. ఈ ఏడాది అవార్డును అద్దేపల్లి లక్ష్మణశాస్త్రికి ప్రకటిస్తూ సమావేశం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ ఏడాది దసరా నాటికి కొత వారి ధర్మ సత్రం నూరేళ్లు పూర్తి చేసుకుంటుందని, శత వార్షిక వేడుకలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తామన్నారు. బ్రాహ్మణ మేధావులను సత్కరిస్తూ పలు కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏపీబీఎస్ఎస్ఎస్ ప్రతినిధులు శ్రీరామచంద్రమూర్తి, అద్దంకి శ్రీనివాసు, సూరం రాజేష్, చెరుకూరి సాయి, ఇంద్రకంటి ప్రభాకర శర్మ, పురుషోత్తమ శర్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జ్వాలాపురం శ్రీకాంత్

జోరు వానలోనూ దుర్గమ్మ సన్నిధికి..

- ఇంద్రకీలాద్రికి తరలివచ్చిన భక్త బృందాలు
- దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పణ
- నేటితో ముగియనున్న ఆషాఢ మాసోత్సవాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆషాఢ మాసోత్సవాల నేపథ్యంలో బుధవారం పెద్ద ఎత్తున భక్తులు దుర్గమ్మకు సారెను సమర్పించారు. తెల్లవారుజాము నుంచి వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా భక్త బృందాలు ఇంద్రకీలాద్రికి కుటుంబ సమేతంగా తరలివచ్చి అమ్మవారికి సారెను సమర్పించాయి. సారె సమర్పించేందుకు తరలివచ్చిన భక్త బృందాలతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం కనిపించింది. మహా మండపం లిఫ్ట్, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్న భక్తులు అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకున అనంతరం మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి సారెను సమర్పించారు. ఆషాఢం ముగింపుతో బుధవారం పెద్ద ఎత్తున భక్తులు కుటుంబ సమేతంగా ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. మధ్యాహ్నం నుంచి వర్షం కాస్త తెరిపి ఇవ్వడంతో సారె సమర్పించే భక్తుల తాకిడి పెరిగింది.

ఘాట్‌రోడ్డు మూసివేత

ఎడతెరిపి లేకుండా వర్షం కురియడంతో దుర్గగుడి ఘాట్‌రోడ్డును మూసివేశారు. ఘాట్‌రోడ్డు మీదగా ఎటువంటి రాకపోకలను అనుమతించలేదు. దేవస్థాన బస్సులను కనకదుర్గనగర్ వైపు మళ్లించగా, భక్తులను మహా మండపం లిఫ్ట్, మెట్ల మార్గం ద్వారా అనుమతించారు. సాయంత్రం వరకు ఇదే పరిస్థితి నెలకొంది.

నేటితో ఆషాఢ మాసోత్సవాల ముగింపు...

దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో జరుగుతున్న ఆషాఢ మాసోత్సవాలు గురువారంతో ముగియనున్నాయి. దేవస్థాన అర్చకులు, వైదిక కమిటీ, వేద పండితులు గురువారం అమ్మవారికి సారె సమర్పించనున్నారు. గురువారం సాయంత్రం వరకు భక్తులు అమ్మవారికి సారెను సమర్పించవచ్చునని, మహా మండపం ఆరో అంతస్తులో భక్తుల పూజలందుకుంటున్న ఉత్సవ మూర్తి ప్రధాన ఆలయానికి చేరుకుంటుందని అధికారులు పేర్కొన్నారు.



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



సారె సమర్పించేందుకు తరలివచ్చిన భక్త బృందాలు



ఘాట్‌రోడ్డు గేట్లు మూసివేసిన దృశ్యం

వృద్ధుడి ఆత్మహత్య

అజిత్ సింగ్‌నగర్ (విజయవాడ సెంట్రల్): ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ వృద్ధుడు గుడ్‌నైట్ లిక్విడ్ తాగి మృతి చెందిన సంఘటన అజిత్ సింగ్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేదారేశ్వరపేట ఒకటో లైన్‌కు చెందిన పాటిబల్ల వెంకట శేషగిరి (66)కి భార్య, ఇద్దరు సంతానం. పిల్లలిద్దరికీ వివాహాలు కాగా వేరే ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు. అయితే శేషగిరి తన భార్యకు మధ్య మనస్పర్థలు రావడంతో శేషగిరి ఒక్కడే జీవనం సాగిస్తున్నాడు. శేషగిరికి ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో ఒత్తిడికి లోనయి ఈనెల 20న తన ఇంటిలో ఉన్న గుడ్‌నైట్ దోమల లిక్విడ్ తాగేసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని ఆ ఇంటి పక్కనే ఉంటున్న విజయ రాఘవ అనే వ్యక్తి గమనించి చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న ఆయన బుధవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు సూర్య తేజ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటు.. మొదటి గంటే కీలకం

- ఛాతీలో నొప్పిని నిర్లక్ష్యం చేయొద్దు
- డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): గుండెపోటుతో ఆక స్మికంగా మరణిస్తున్న వారిని ఇటీవల చూస్తున్నామని, గుండెపోటు వచ్చినప్పుడు మొదటి గంట ఎంతో కీలకమని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్, కార్డియాలజిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు డాక్టర్ పి.చంద్రశేఖర్ అన్నారు. ఛాతిలో నొప్పి వచ్చిన వెంటనే అరగంటలో ఆసుపత్రికి వచ్చి, థ్రోంబోలైటిథెరపీ చేయించుకుంటే ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉందన్నారు. కార్డియాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా ఆంధ్ర ప్రదేశ్ చాప్టర్ ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి 20 వరకూ మంగళగిరిలోని ఎన్ఆర్ఐ వైద్య కళాశాలలో కార్డియాలజిస్టుల సదస్సు నిర్వహించారు. ఆ సదస్సు విజయవంతమైన సందర్భంగా బుధవారం ఆయుష్ ఆస్పత్రిలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఛాతిలో నొప్పి వచ్చిన అరగంటలో ఆస్పత్రికి వస్తే థ్రోంబోలైటిథెరపీ చేస్తారన్నారు. గంటన్నర లోపు ఆస్పత్రికి వెళితే ఎమర్జెన్సీ ప్రైమరీయాంజియోప్లాస్టీ నిర్వహిస్తారని చెప్పారు. ఆయుష్ ఆసుపత్రి డైరెక్టర్, సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ పీఎస్ శ్రీనివాస చౌదరి మాట్లాడుతూ ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీలో జరిగిన కాన్ఫరెన్స్ లో 400 మంది కార్డియాలజిస్టులు పాల్గొన్నట్లు వెల్లడించారు. అంతేకాక 68 శాస్త్రీయ సెషన్ల ద్వారా 62 మంది ప్రఖ్యాత ప్రతినిధులు, అమెరికా ఇతర దేశాల నుంచి వచ్చిన 9 మంది అంతర్జాతీయ ప్రతినిధులు పాల్గొన్నట్లు వివరించారు. ఈ కాన్ఫరెన్స్ కార్డియాలజీ, క్లినికల్ ప్రాక్టీస్, గుండె సంబంధిత వైద్య రంగంలో జరుగుతున్న తాజా అభివృద్ధిపై అవగాహనకు ఒక ఉత్తమ వేదికగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న హెల్త్ యూనివర్శిటీ వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్, పక్కన డాక్టర్ శ్రీనివాస చౌదరి

యువతిని మోసగించిన వ్యక్తిపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో యువతి ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అజిత్‌సింగ్ నగర్‌కు చెందిన యువతిని భవానీపురం ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డుకు చెందిన ప్రసన్నకుమార్ ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి కోరిక తీర్చుకున్నాడు. పెళ్లి చేసుకోవాలని యువతి కోరగా అందుకు అతను నిరాకరించాడు. మోసపోయానని తెలుసుకున్న యువతి తనకు జరిగిన అన్యాయంపై భవానీపురం పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రసన్నకుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యోగాసన పోటీల్లో గీతిక ప్రతిభ

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఈ నెల 20 యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన యోగా పోటీల్లో శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థిని పి.గీతిక సత్తా చాటింది. ఆ పోటీల్లో యోగాసన ఆఫ్ ట్రెడిషనల్ యోగా ఫస్ట్ ప్రైజ్, ఫార్వర్డ్ బెండింగ్ యోగాలో ఫస్ట్ ప్రైజ్‌తో పాటు, మెరిట్ సర్టిఫికెట్ పొందింది. దీంతో ఆమెను బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ ప్రత్యేకంగా అభినందించారు. రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.